


# సర్పశిల

## – భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

ఇప్పటివరకూ జరిగిన కథ

ఎపిసోడ్ :1 (జనవరి)

శృంగి, మట్టు అడవిలో నడుస్తూ ఓ శిథిలాలయానికి చేరుకుంటారు శృంగి బ్రాహ్మణుడు. మట్టు భిల్లుడు. ఆ ఆలయంలో 18 చేతులు గల నిలువెత్తు అమ్మవారు. తిరిగి వచ్చేప్పుడు ఓ భయంకరమైన పాము తోక మీద నిలబడి వారిని అడ్డగిస్తుంది. శృంగి స్పృహ తప్పుతాడు.

ఎపిసోడ్: 2 (ఫిబ్రవరి)

రాబీ వెబ్‌స్టర్ అనే అమెరికన్ ని జయదేవ్ ఏర్‌పోర్ట్ కి వెళ్ళి రిసీవ్ చేసుకుంటాడు. ఆ రాత్రి రాబీ(రాబర్ట్)కి విలియమ్స్ అనే ఆత్మ కనిపిస్తుంది. జయదేవ్ రాబీని తిరుపతి పంపుతూ డ్రైవర్ని చూస్తాడు. ఆ డ్రైవర్ అచ్చు రాబీ వర్ణించిన విలియమ్స్ పోలికతో వుండడం జయ్‌ని విస్మయానికి గురిచేస్తుంది.

ఎపిసోడ్: 3 (మార్చ్)

శృంగి, మట్టూ రామజోగినీ, మధురనీ కలుస్తారు. పాము విషయం మట్టు రామజోగికి వివరిస్తాడు.

జర్నీలో రాబర్ట్ విలియమ్స్‌లా వున్న డ్రైవర్‌తో సంభాషిస్తాడు. శ్రీనివాస్ రాబీని రిసీవ్ చేసుకుంటాడు. రాబీ హోటల్ గదిలో కళ్ళు తిరిగి పడిపోతాడు.

ఎపిసోడ్ 4: (ఏప్రెల్) తక్ష పురం గురించి రామజోగికి వర్ణిస్తాడు మట్టూ. రాబీకి స్పృహ వస్తుంది. శ్రీనివాస్‌తో గోవిందరాజస్వామి ఆలయంలోకి అడుగుపెట్టి చిత్రంగా ఆ గుడంతా పరిచయం ఉన్నట్టు నడుస్తూ తెలుగు మాట్లాడతాడు. స్వామిని చూచి గట్టిగా అరిచి స్పృహ తప్పుతాడు రాబీ. షోలింగర్‌లో జయదేవ్, సుదర్శన్ భట్టాచార్య రాబీ గురించి డిస్కస్ చేస్తారు. రామజోగి మధురని సముదాయిస్తాడు. రాబీ స్పృహలోకి వచ్చి శ్రీనివాస్‌తో విలియమ్స్ గురించి చెబుతాడు.

ఎపిసోడ్:5 (మే) జయ్ శ్రీనివాస్ రాబీ గురించి శాస్త్రిగారితో డిస్కస్ చేస్తారు.

ఎపిసోడ్:6 (జూన్) అందరూ, అంటే జయ్, రాబీ, శ్రీనివాస్, శాస్త్రిగారూ, సుదర్శన్ రెండు కార్లలో పలమనేరు వైపుకి బయల్దేరతారు. శ్రీనివాస్ సామాన్లతో రెండో కారులో ఉంటాడు. వారణాసి, మోహన్ గిరి, కిషన్ బైరాగి గంగాతీరాన పరిచయం అవుతారు. కిషన్ హిందూ మతం వదిలి ఫకీర్‌కి శిష్యుడవుతాడు. ఫకీర్ కిషన్‌కి 'బిదాసీ' అనే శక్తిని చూపుతాడు.

ఎపిసోడ్ 7: (జూలై)

తక్షపురానికి ఓ ముసలిది వస్తుంది. ఆమెకీ సర్పశిలకీ సంబంధం ఏదో ఉందని జనాలు రకరకాలుగా ఊహిస్తుంటారు. ఆలయ పూజారి, ప్రవచకుడూ, ప్రెసిడెంటూ డబ్బులు దండుకునే ఆలోచనలు చేస్తూంటారు. జయ్, శాస్త్రిగారు, రాబీ, సుదర్శన్‌లు వెడుతున్న కారు రోడ్డు పక్కకి పడిపోతుంది.

ఎపిసోడ్ 8 (ఆగస్టు) పెద్ద పుల్లేటి కుర్రు ఆశ్రమంలో కన్యాదేవి, మాయాదేవి మరో పదహారుమంది ఉంటారు. వారిని అక్కడికి పంపింది నిశ్చలానంద (వారణాసి) అవధానీ, హనుమంతు ఆశ్రమం గురించి మాట్లాడుకుంటారు. విలియమ్స్ తూఫానులోనించే శ్రీనివాస్‌తో ఆహారం జలం మొదటి కారు వాళ్ళకి పంపుతాడు.

మట్టూతో బాటు శృంగిని కూడా శిథిలాలయానికి వెళ్ళమని ఆదేశిస్తాడు రామజోగి.

ఎపిసోడ్ 9 (సెప్టెంబర్)

ప్రకృతి ప్రేమికులు, రక్షకులు దేవతలు.

ప్రకృతి నాశకులు రాక్షసులు

ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. మదాలస హార్స్‌లీ హిల్స్ గురించి సుదర్శన్‌కి వివరిస్తుంది. యజ్ఞనారాయణగారు శాస్త్రిగారు జరుగుతున్న సంఘటనల గురించి చర్చిస్తారు.

ఎపిసోడ్ –10

అవధాని హనుమంతుని హెచ్చరిస్తాడు.అవధాని పాములు లలలోకి రావడం గురించి సూరయ్యగారికి చెబుతాడు .తక్షపురంలో ముసలిది శాపాలు పెడుతూ వికటాట్ట హాసం చేస్తుంది.

తరువాయి భాగం చదవండి ...

"**మీరెక్కడినించి** పరిశోధన మొదలు పెట్టాలనుకున్నారు?"

ప్రశ్నించాడు గోర్కీ. వాళ్ళు సమావేశమై దాదాపు నాలుగు గంటలు అయింది.

"మీరే చెప్పండి" సూటిగా గోర్కీ కళ్ళలోకి చూస్తూ అన్నాడు స్టిట్సన్.

"మీరు నాకు ఇచ్చిన ఫైల్స్ అన్నీ చదివి జీర్ణించుకోవడానికి వారం పట్టింది. ఇక్కడి గొప్పతనం ఏమంటే ఏ ఒక్క చిన్న విషయాన్నీ విస్మరించకుండా అక్షరీకరించడం. కేవలం అ భౌతిక విషాయాలనేకాక దేశ రాజకీయ, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక వ్యవహారాల్లో వచ్చిన మార్పులను కూడా మీరు రికార్డు చెయ్యడం" ఆగాడు గోర్కీ.

"అఫ్‌కోర్స్ ఏదీ తనంతట తానుగా వుండదు. ఉదాహరణకి ఒక సెల్‌ఫోన్ వచ్చింది. అది మనిషి ఊహకి కూడా 50 సంవత్సరాల క్రితం రాలేదు. మరి ఇప్పుడు. అది వచ్చింది. అందరి చేతుల్లోకీ అందుబాటులోకి వచ్చింది. కానీ ఎన్ని మాడిమసైపోయాయి? మొదట 'పేజర్స్' కనుమరుగయ్యాయి. తరవాత ఎస్.ట్.డి బూతులు కనుమరుగయ్యాయి. స్టాప్‌వాచీలు కనుమరుగయ్యాయి. కాలిక్యులేటర్లు కనుమరుగయ్యాయి. కార్డులు, కవర్లు ఉత్తరాలు, గ్రీటింగ్ కార్డులూ టెలిగ్రామ్ లూ అన్నీ కాలంలో కలిసిపోయాయి. జెరాక్స్ షాపులు మూతబడ్డాయి సెల్‌లో స్కానర్లు రాగానే. అసలు జనాలు వాచీలు పెట్టుకోవడమే 80 శాతం మానేశారు. టేపు రికార్డర్లు మాయమయ్యాయి. ఫోటో స్టూడియోలు నిర్వీర్యమయ్యాయి. ఎంతమంది ఉపాధి గంగలో కలిసిందో ఊహించగలమా? మరి, ఒకటి వచ్చింది – కానీ – ఎన్నిటిని లోకం నుంచి పంపేసిందీ? ట్రాక్టర్లొచ్చాయి. ఎడ్ల బళ్ళు, ఒంటె బళ్ళూ నీరసించిపోయాయి. రైతు కూలీల బతుకు తెల్లారిపోయింది. మైడియర్ గోర్కీ ఇది తిరోగమనమా పురోగమనమా? వేగాన్ని సాధించాం. మానవత్వాన్ని ముంచేశాం. నిరీశ్వరవాదాన్ని ప్రోత్సహించి పాపం పుణ్యం స్వర్గం నరకం లేదని మైకులు పెట్టి మరీ జనాల చెవుల్లో విషాన్ని నింపాం. ఏమయిందీ, స్వార్థం పెచ్చు పెరిగిపోయింది. డబ్బుకి తప్ప లోకంలో దేనికీ విలువలేకుండాపోయింది. ఇవన్నీ నీకు తెలీనివి కాదు. కానీ ఎక్కడ మొదలెట్టాలీ? నా దృష్టిలో మీ దేశం నించే మొదలెట్టాలి. కృష్ణుడు అన్నాడుగా 'యథాయధా ధర్మస్య'అని. ధర్మానికి గ్లాని/హాని ఎప్పుడూ జరిగేది మీ దేశంలోనే. అందుకే భగవంతుడి అవతారాలన్నీ భారతదేశంలోనే అవతరించాయి. ఇంతకు ముందు వచ్చిన ముప్పు కొన్ని దేశాలకీ ప్రజలకీ మాత్రమే. ఇప్పుడు రాబోయే ముప్పు సర్వ ప్రపంచానికీ" వివరంగా చెప్పాడు స్విట్సన్.

"ఆ విషయంలో సందేహం లేదు. గుట్టల గుట్టల అణ్వాయుధాలు లెక్కపెట్టలేనన్ని ఇంటర్ కాంటినెంటల్ బెలాస్టిక్ మిస్సైల్సూ, అవిగాక రసాయనిక, జీవ ఆయుధాలూ భూమినీ భూమిలోని జీవజాలాన్నీ కంబళించడానికి సిద్ధంగా వున్నాయి. మీకు కొంచెం తక్కువ. కానీ, మాకు ఒకప్పుడు కాస్త తక్కువగా వున్న కుల, మత వివక్షలూ, ధనిక బీద వర్గపోరాటాలూ సమాజంలో కాన్సర్‌లా వ్యాపించి సంఘాన్ని కృంగి కృశింపజేస్తున్నాయి. ప్రతీదేశమూ మరో బలహీన

దేశం మీద పెత్తనం చెయ్యాలనే చూస్తోంది. ఆర్థికంగా సర్వనాశనం వైపుకి తోస్తోంది. ఇక కార్పొరేట్ సంస్థలు బకాసురులుగా మారాయి. విద్యా, వైద్య, వ్యవసాయ, సినీ, అదీ ఇదీ అని లేకుండా అన్ని రంగాల్నీ దిగమింగేస్తున్నాయి. న్యాయం అనేది ధనపు కోరల్లో చిక్కుకుని వుంది. మనిషి మనిషిలోని దైవత్వాన్ని గుర్తించక చిక్కుకుని వుంది. మనిషి మనిషిలోని దైవత్వాన్ని గుర్తించక మూఢాతి మూఢ నమ్మకాలతో తనను తాను చంపుకుంటున్నాడు. ఇంటర్‌నెట్‌లు వచ్చి చిన్నవాళ్ళని కూడా శృంగారం అదీ మితిమీరిన విచ్చలవిడి శృంగారం వైపుకి మళ్ళించి వీధి వీధినీ ముళ్ళపొదలుగా మారుస్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడే మందు. ఎక్కడ పడితే అక్కడ బార్లు. తాగుడూ నేర్పేది ప్రభుత్వాలే, తాగుబోతుల డబ్బుతో నడిచేదీ ప్రభుత్వాలే. ఫ్రెండ్... సమాజం కుళ్ళిపోయింది. మాటలవల్లనో, పవిత్ర గ్రంథాలూ బోధలూ వల్లనో పని జరిగే కాలంపోయింది. మూర్ఖుల చేతుల్లో ఉన్నాయి ట్రిగ్గర్లు.. ఎప్పుడు వాటిని నొక్కి సర్వనాశనాన్ని తెస్తారో వాళ్ళకే తెలీదు" నిట్టూర్చి అన్నాడు గోర్కీ.

"ఒక మహావిపత్తు, విధ్వంసం తప్పదు. కానీ ఆ పరిమాణాన్ని ఎంత తగ్గించగలమో చూడాలంటే మన మెదళ్ళకి పని పెట్టక తప్పదు. ఎన్ని మార్గాలు వెతగ్గలమో అన్ని మార్గాలూ వెతుకుదాం. ఐకమత్యంగా శాంతి కోసం పోరాడడం ఒక్కటే మనకి మిగిలిన ఆయుధం" స్పష్టంగానూ, సూటిగానూ అన్నాడు రజోవ్‌స్కీ

"యస్... ఐ ఎగ్రీ.. మనం మన సోర్స్ ద్వారా ఎంత ఇన్‌ఫర్మేషన్ రాబట్టగలమో రాబట్టి ఓ ప్రణాళికను నిర్ణయించుకుందా" ధృఢంగా అన్నాడు డాంటే.

డి3లో ఓ నిర్ణయాత్మకమైన సంఘటన జరిగిన ఆ రోజునే వినాయకుడి నిమజ్జనాల్లో అపశృతి దొర్లి వందమంది మరణించారు. అంతేగాదు ఆ సంఘటన అనేక మత కల్లాలాలకి దారి తీసింది. మతకల్లాలల్లో మరణించిన వారు రెండు వేల నాలుగు వందలమంది. ప్రతి ఆసుపత్రి నగరంలో ఆనాడు రోగులతో, శవాలతో కిటకిటలాడిపోయింది. ఇవేమీ తెలియని గోర్కీ, స్టిట్సన్, డాంటే, రజోవ్‌స్కీలు లోకాన్ని ఎలా రక్షించాలా అని చర్చిస్తూ, విస్కీ సిప్ చేస్తున్నారు.

"ఈ మతకలహాలు తమంతట తాముగా పుట్టలేదు. సృష్టించబడ్డాయి. గణేశ్ నిమజ్జనం దగ్గర జరిగిన ప్రమాదమూ సృష్టించబడిందే. పెల్లుబికిన కల్లోలాల్లోంచి జనాలు కోలుకోవడానికి చాలా సమయం పడుతుంది. మరో పక్క ఏ మతాన్ని యీ కల్లోలానికి బాధ్యుల్ని చేసినా మరో మతం విరుచుకుపడటానికి సిద్దంగా వుంది. అసలు ఎంక్వయిరీనే ముందుకు సాగట్లేదు. కారణమందరికీ తెలిసిందే. రాజకీయాలూ, నాయకులూ" మట్టుకు అన్నాడు వాసుదేవ్. ఎస్పీగా వాసుదేవ్ రికార్డు అద్భుతం. క్లీన్ అండ్ నీట్. సిన్సియారిటీ 100% ఇన్వెస్టిగేషన్‌ని 60%కి దాటనివ్వలేదు అధికారులు. ఎందుకంటే, కేసు రిజల్టు ఫలానా అని తెలిసేలోపలే వాసుదేవ్‌ని ఆ కేసునించి పక్కకి పంపడం.

"ప్రస్తుతం నడుస్తున్న చరిత్ర అలావుంది వాసుదేవ్. చెయ్యడానికి చాలా వున్నా ముందరి కాళ్ళకి ఎప్పుడో బంధాలు వేసేశారు." నిట్టూర్చి అన్నాడు పుండరీకాక్షుడు వాసుదేవ్ తండ్రి. ఆయన కానిస్టేబుల్‌గా జీవితం ఆరంభించి సర్కిల్ ఇన్‌స్పెక్టరుగా రిటైర్ అయ్యాడు. పోలీసు జీవితాన్ని కాచి ఒడబోసినవాడు.

"అలా అని చేతులు ముడుచుకుని కూర్చో లేము కదా నాన్నగారూ" నిస్సహాయతలోనించి పుట్టిన ఆవేశంతో అన్నాడు వాసుదేవ్.

"పులికీ చిరుతకూ సింహానికీ కూడా ఓపిక ఎక్కువ. గంటలు గంటలు అవకాశం కోసం కాచుకుని వుంటాయి. వాటిని వేటాడే వేటగాడికి ఇంకెంత సహనమూ ఓర్పూ వుండాలీ? ఆవేశం పుట్టాల్సింది ఆలోచనలోనించి. నిస్సహాయతనించి కాదు వాసుదేవ్" చిన్నగా నవ్వి అన్నాడు పుండరీకాక్షుడు.

"ఆ వేట మృగానికీ మనిషికీ మధ్య జరిగేది. ఇది జరిగింది జిత్తులు నేర్చిన మానవమృగాల మధ్య. ఎందుకు చంపుతాడో తెలీదు. వాళ్ళకి కావల్సింది ఒకటే.. అల్లకల్లోలం సృష్టించడం. వాళ్ళు దానికి ఎంచుకునేది అమాయకుల్ని నిరపరాధుల్నీ" నిట్టూర్చి అన్నాడు వాసుదేవ్.

"నీలో రగులుతున్న రక్తమూ, బాధాకూడా నాకుతెలుసు. కల్లోలం సృష్టించడమే వాళ్ళ ముఖ్య ఉద్దేశ్యమూ లక్ష్యమూ అయితే, వారిని ట్రాక్ చెయ్యడమూ కష్టాతి కష్టంకాదు. కొంత నేర్పు, కొంత ఓర్పు చాలు. ఒక పోలీసు చెయ్యవలసింది చిరునవ్వుని నిట్టూర్పులుగా మార్చడంకాదు. నిట్టూర్పుల్ని చిరునవ్వులుగా మార్చడం. అందుకే మళ్ళీ మళ్ళీ రిపోర్ట్స్ చదువు. మళ్ళీ మళ్ళీ వెదికినచోటే వెదుకు. తప్పకుండా ఓ 'లీడ్' లభిస్తుంది" కొడుకు భుజం తట్టాడు పుండరీకాక్షుడు.

"థేంక్స్ డాడ్.. ఆ పనే చేస్తా" లేచాడు వాసుదేవ్.

"ఒక్క క్షణం" అంటూ లోపలినించి బయటికి వచ్చి వాసుదేవ్ నుదుటిన ఓ చిన్న అగ్గిపుల్ల తొడిమతో సింధూరాన్ని అద్దింది సౌభాగ్యలక్ష్మి. ఆవిడ పుండరీకాక్షుడి భార్య, వాసుదేవ్ తల్లీ.

"సరేనమ్మా వెళ్ళొస్తా" చిన్నగా నవ్వుకుంటూ జీప్ ఎక్కాడు వాసుదేవ్. చిన్నప్పటినించీ హనుమంతుడి సింధూరాన్ని పెట్టడం తల్లికి అలవాటే. అప్పుడూ ఇప్పుడు ఎప్పుడూ ఆమె మారలేదు.

"అయ్యా, ఇడ్లీ, పూరీ, పొంగల్‌తోబాటు బొబ్బట్లు కూడా హాట్‌పేక్ నిండుగా పెట్టారట. ఏమీ మిగలకూడదని మీతో మరీ మరీ అమ్మగారు చెప్పమన్నారు" చనువుగా అన్నాడు కానిస్టేబుల్ అచ్యుత నారాయణ.

"అలాగే, నువ్వు వుంటావుగా" అచ్యుతనారాయణ్ భుజం మీద చరిచి అన్నాడు వాసుదేవ్.

వాసుదేవ్ అంటే అందరికీ అభిమానమే. అందర్నీ బహువచనంతోనే సంబోధిస్తాడు. దోషులుగా పట్టుకున్న వారినయినా సరే మర్యాదగా సంబోధిస్తాడు. మర్యాదగా చూస్తాడు. కరకుదనం, మొరటుదనం ఏమాత్రం అతనిలో కనిపించవు. మనిషి చాలా సాత్వికుడు. మనసు అతిసున్నితం. విచిత్రం ఏమంటే అతను పిస్టల్ పట్టుకున్నా, రైఫిల్

పట్టుకున్నా ఎప్పుడూ ఏనాడూ గురితప్పదు. సమస్యలో లోతుల్లోకి వెళ్ళి పరిశీలించడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. మతకల్లోలాలవల్ల, కులభేదాలవల్ల వచ్చే సమస్యలన్నీ అతనికి అయిష్టం. అందరూ చల్లగా ఎవరి జీవితం వారు బ్రతకాలనే తత్వం అతనిది. అందరూ అంటారు. పోలీస్ ఫోర్స్‌లోకి పొరబాటున వచ్చాడని. కానీ నిజం వేరు. అతను సాక్ష్యాల్ని నమ్మడు. సత్యాన్ని నమ్ముతాడు.

"పక్కదేశం వాళ్ళు యీ కల్లోలాన్ని సృష్టించారని పటిష్టమైన ఆధారాలు దొరికాయి. ఆ తీవ్ర వాదుల్లో కొందరు పాతబస్తీలో ఉన్నారన్న విషయమూ నిర్ధారణ అయింది" సెల్యూట్ చేసి అన్నాడు ఎస్.ఐ చిదంబరం.

"ఊ" సాలోచనగా అన్నాడు వాసుదేవ్. "నిజాలు వేరు, ఇవి పటిష్టమైనవి అనిపించే ఫేక్ ఆధారాలు వేరు. ఇప్పుడు మనం అక్కడికి వెళ్ళి విచారణ మొదలు పెడితే దొరికేది దోషులు కారు, నిరపరాధులు. వారిని ఎలా వాడుకోవాలో ఎలా వాళ్ళ చేత తాము అనుకున్నది చెప్పించాలో 'పెద్దల'కి బాగా తెలుసు" నిర్లిప్తంగా అన్నాడు వాసుదేవ్.

"పైనించి..." ఆగాడు ఎస్.ఐ.

"నిమిషానికోసారి ఫోన్లు వస్తూనే వున్నాయి. వాళ్ళని మౌనంగా వుంచాలంటే, ఎవళ్ళనో ఒకళ్లని పట్టుకుని, ఆ అవాంఛిత సంఘటనల వెనకవున్నది వీళ్ళేనని ప్రెస్‌మీట్‌లో చెప్పాలి. కానీ, చిదంబరంగారూ అమాయకుల్ని ఇరికించడం నా అభిమతంకాదు. కోర్టు ఎప్పుడో అప్పుడు తీర్పుని ఇస్తుంది వాళ్ళు అమాయకులని. కానీ వారూ వారి కుటుంబాలూ పడే క్షోభని తీర్పులు తీర్చలేవుగా. మరింత లోతుగా పరిశీలిద్దాం. మరింత శ్రద్ధతో కేస్‌డీల్ చేద్దాం" శాంతంగా, అనునయంగా అన్నాడు వాసుదేవ్.

"సర్.." వాసుదేవ్ పక్కగా వచ్చి అన్నాడు నబీ. నబీ పోలీస్ స్టేషన్ ఎదరగా టీ కొట్టుపెట్టుకున్న గ్రాడ్యుయేట్. చక్కని ప్రవర్తన. పోలీసులకి కూడా అతనంటే ఓ అభిమానం. చక్కగా డ్రెస్ చేసుకుని ఉంటాడు. తలమీదలేసు టోపీ. టీస్టాల్‌ని శుభ్రంగా ఉంచుతాడు. వయసు ఇరవై అయిదు, ఇరవై ఆరేళ్ళ మధ్యలో వుంటోంది. అతని చేతిలో టీ కప్పుంది.

"బోలో నబీ" అన్నాడు వాసుదేవ్, చిదంబరాన్ని పక్కకి వెళ్ళమని సైగచేస్తూ – చిదంబరం పక్కకి వెళ్ళాక,

"సర్.. యీ గొడవలకి వెనకవుంది బీహార్‌నించి వచ్చిన ఓ ముఠా. హిందువుల వేషాల్లోనే వచ్చారుట. వారి మతం సంగతి తెలీదు. ఈ ఇన్‌ఫర్మేషన్ ఇచ్చింది గులాబో, " టీ కప్పు టేబుల్ మీద పెట్టి అన్నాడు నబీ.

"గుడ్.. గులాబోని షిరిడీసాయి గుడికి రమ్మని చెప్పు" నబీ వంక మెచ్చుకోలుగా చూసి అన్నాడు వాసుదేవ్. నాబీ వెళ్ళాక తండ్రికి యీ విషయం ఫోన్ చేసి గులాబోతో మాట్లాడమని చెప్పాడు. వాసుదేవ్ మనసులో ఓ చిన్న రిలీఫ్. చిదంబరాన్ని పిలిచి, "ఓసారి ఆ సంఘటనలు జరిగిన స్థలాల్ని పరిశీలిద్దాం" అని బయలుదేరాడు. గులాబో పూర్వీకులు రాజస్తానీలని వాసుదేవ్‌కి తెలుసు.

గులాబోది ఓ విచిత్రమైన జీవితం. తల్లి హరియాణా జాట్. తండ్రి రాజపుత్. వాళ్ళు హిందీ, హరియాణవీ, బాగిడీ, మార్వాడీ భాషలేకాక పంజాబీ, భోజపురీ కూడా మాట్లాడేవారు. తల్లిది కురుక్షేత్ర, తండ్రి హనుమాన్‌గడ్. వాళ్ళిద్దరికీ పరిచయం అయింది ఢిల్లీలో. గులాబో అసలుపేరు రామ్ కలీ. ఆ కాలంలో ఆమె చదువుకున్నది ఎనిమిదో తరగతి. పదకొండో యేటే పెళ్ళిచేశారు. అది వారి ఆచారం. పిల్ల పెద్దమనిషయ్యాక పెళ్ళిచేస్తే స్వర్గద్వారాలు శాశ్వతంగా మూసుకుంటాయని వారి నమ్మకం. పెళ్ళయిన రెండేళ్ళకిగానీ గులాబో పెద్ద మనిషి కాలేదు. తల్లిదండ్రుల వంశాలు గొప్పవే. కానీ ఆర్థికంగా మధ్య తరగతివాళ్ళు. తండ్రి కేవల్‌సింగ్ రాజ్‌పుత్ మహా అభిమానవంతుడు. ఉద్యోగం చేస్తే తమ పూర్వీకులకి అప్రతిష్ట అనుకునే అభిమానం అతనిది. రామ్ కలీ చిన్న తనమంతా ఓ రకమైన అహంభావాల మధ్య గడిచింది. రామ్కలీ తల్లి సరస్వతీదేవి 'పాడి'ని నమ్ముకుని కుటుంబాన్ని పోషించింది. హరియాణా ఒకప్పుడు యాదవుల భూమి. ఇప్పటికీ అక్కడ పాలు, పెరుగు, వెన్న, నెయ్యి సమృద్ధిగా లభిస్తాయి. హరియాణా పాడిపంటలకి ప్రసిద్ధి చెందినది. తల్లితండ్రులిద్దరూ గురుగ్రామ్, (గుడ్‌గావ్)లో బ్రతుకు వెళ్ళదీశారు.

ఓనాడు గులాబో, అంటే రామ్ కలీ తండ్రి కేవల్‌సింగ్ ఓ రౌడీతో గొడవపడి కత్తితో పొడిచి జైలుకెళ్ళాడు. సరస్వతి ఒంటరిగా జీవితాన్ని లాగుతూ బిడ్డని పెద్ద చేసింది. ఒకానొక తన్మయస్థితిలో రామ్ కలీ తన స్నేహితుడు అభిమన్యుతో గుర్‌గావ్‌ని వదిలి హైద్రాబాద్‌కి వచ్చేసింది. కారణం, రామ్ కలీకి కట్టబెట్టిన భర్త మూర్ఖుడు. రోజూ మొగ్గని చిదిమినట్టు భార్యని చిదిమిపారేసేవాడు. వయసూ అతనికి ఎక్కువే. దాంతో అభిమన్యుతో హైదరాబాద్‌కి వచ్చేసింది. కారణం గుర్‌గావ్‌లో ఉన్న రామ్ కలి స్నేహితురాలు సునీతారెడ్డి. సునీతా రెడ్డి తండ్రి గుర్‌గావ్‌లో డిఎస్.సిలో పనిచేసేవాడు. అంటే డిఫెన్స్ సెక్యూరిటీ కార్ప్స్‌లో అన్నమాట. రామ్ కలీ ఎనిమిదిలో వున్నప్పుడే రెడ్డిగారు రిటైరై హైదరాబాద్ (స్వస్థలానికి) వచ్చేశారు. ఉత్తర ప్రత్యుత్తరాలు ఉన్నాయి గనక ధైర్యంతో రామ్ కలీ ఇంగ్లీషు బాగా నేర్చుకుంది. సునీతారెడ్డి స్నేహంతో కొంత తెలుగూ నేర్చుకుంది. కారణం, ఆ రోజుల్లో హర్యానా రాష్ట్రం తెలుగు భాషని ఆప్షనల్‌గా ప్రవేశపెట్టడమే. అభిమన్యు మీద సినిమా ప్రభావం ఎక్కువ. చాలామంచివాడు. అందుకే మహా పిరికివాడు కూడా. కొన్నాళ్ళయ్యాక రామ్ కలీతో చెప్పకుండా సొంతవూరు చెక్కేశాడు. అయితే వెళ్ళిపోతున్నాననే ఉత్తరం రాసిపెట్టాడు గనక రామ్ కలీ నిట్టూర్పుతో సరిపెట్టుకుంది. సునీతా వాళ్ళుకూడా ఎంతకాలం పోషించగలరూ? వాళ్ళ ఇబ్బంది రామ్ కలీకి అర్థమై, సత్‌నామ్ సింగ్ అనే స్వీట్ షాప్ నడిపే జాట్‌తో జతకట్టింది. సత్‌నాం సింగ్ ఒంటరివాడు. స్వీట్లు చెయ్యడంలో ఎక్స్‌పర్ట్. ఆంధ్రాలో రాజస్తాన్ స్వీట్స్‌కీ, కచోరీలకి మహా గిరాకీ. ఓ స్త్రీ తోడుంటే ఇంకేం కావాలీ. రాం కలీని ముద్దుగా సత్‌నామ్ గులాబో అనిపిలిచేవాడు. అదే ఆమె పేరై కూర్చుంది. గతం సంగతి ఏమైనా గులాబో జీవితం హాయిగా సజావుగా ఉంది. నబీ టీస్టాల్ పక్కనే గులాబో సత్‌నాం సింగ్‌ల స్వీట్ స్టాల్ ఉంది. (గులాబోకి బిహారీ భాష, భోజ్‌పురీ వచ్చని ఇందాకే చెప్పుకున్నాంగదా.)

జియా ముస్తఫిజుర్‌కి అరవై ఏళ్ళు. ఓ దయాపరుడైన ముసల్మాన్. ఆయన జీవితంలో ఎవరికీ అపకారం చేసినవాడు కాదు. మక్కామదీనా పుణ్య తీర్థాలని తిరిగొచ్చిన వాడు గనక 'హజీ' అనే గౌరవ నామం అతనిపేరు ముందు ఉంది. పిల్లలందరూ పెద్దవాళ్ళై ఎవరి ఉద్యోగాలు వాళ్ళు చేసుకుంటున్నారు.

"హాజీసాబ్.. సలాం అలేకుం " అంటూ చనువుగా జియాగారి పక్కన కూర్చున్నాడు ఎస్.పి వాసుదేవ్. అల్లర్లు జరిగిన చోట ఎంత వెదికినా, ఎంత ప్రశ్నించినా ఏమాత్రం పరిశోధన ముందుకి సాగలేదు. పాతబస్తీకి ఎప్పుడొచ్చినా వాసుదేవ్ హాజీ సాబ్‌ని పలకరిస్తాడు. పుండరీకాక్షుడికీ (వాసుదేవ్ తండ్రి) హాజీ సాబ్‌కి మంచి స్నేహం.

"బైఠో వాసూ.. ఇందాక ఇటువైపునించి వెళ్ళడం చూశాను. రిటైర్డ్ లైఫ్. పడక్కుర్చీలో కూర్చుని ప్రార్థన చేసుకోవడమే కదా మిగిలింది" నవ్వాడు హాజీ సాబ్.

"జరిగింది మీకు తెలుసుగదా బాబాయ్" నిస్పృహగా అన్నాడు వాసుదేవ్.

"నీ చోటులో ఏ ఇతర పోలీసు ఆఫీసర్ ఉన్నా అమాయకుల్ని పట్టి భయంకరంగా హింసించి మరీ ఒప్పించేవారు. కానీ, నీ సంగతివేరు. నా స్నేహితుడి సంస్కారం మంచితనం నీలో పుష్కలంగా ఉన్నాయి. బేటా.. నూరేళ్ళూ హాయిగా వర్ధిల్లు. ఇంతవరకూ పటిష్టమైన ఏ ఆధారమూ నాకూ లభించలేదు" వాసుదేవ్ భుజాన్ని ప్రేమగా నిమిరి అన్నాడు హాజీ సాబ్.

"బాబాయ్... ఆధారాల గురించికాదు నా బాధ అసలు ఓ మనిషి మరో మనిషిని ఎందుకు ఇబ్బందిలో పెట్టాలి? మతం అనేది మనిషి ప్రవర్తనని సరిదిద్దడానికీ, సవ్యమైన  మార్గం చూపించడానికి కదా ఉంది. ఏ మతం అయినా చెప్పేది మంచిగా మానవతతో వర్ధిల్లమనేగా. అలాంటప్పుడు మనిషికీ మనిషికీ మతం ఎందుకు పోరాటాల్ని సృష్టిస్తోందీ, పోరాటాన్నీ, యుద్ధాల్ని సృష్టించేది మతం  కాదు. ఆ మతాన్ని తమ బలంగా భావించుకునే కొందరు మత పెద్దలు. ఆ పెద్దల బుద్ధులు మారనంతవరకూ యీ కుల, మత పోరాటాలు సాగుతూనే వుంటాయి. అమాయకులు, ఆలోచనలేని ఆవేశపరులూ బలి అవుతూనే వుంటారు" నిస్పృహగా అన్నాడు వాసుదేవ్.

"నిజం బేటా. ముమ్మాటికీ నిజం. మతం అనేది మనిషి నిర్మించినదీ, మనిషి సృష్టించుకున్నది. అది మానవత్వపు పురోగమనానికి కాక కల్లోలానికీ వినాశనానికీ కారణం అవుతున్నప్పుడు దాని లక్ష్యమే దెబ్బతింటుంది. చూద్దాం. దేవతలూ రాక్షసులూ, మంచివాళ్ళు చెడ్డవాళ్ళూ, పుణ్యాత్ములూ పాపాత్ములూ ఉంటూనే వుంటారుగా. కొంతకాలం చెడుది పై చేయి అయితే, కొంత కాలం 'మంచి'ది పై చేయి. చూద్దాం" వాసుదేవ్ భుజం తట్టి అన్నాడు వాజీసాబ్

పాతబస్తీ రోడ్లనీ జనాలతో కిక్కిరిసివున్నాయి. హడావిడిగా జనాలు తిరుగుతున్నారు. చాలామంది పోలీస్ వెహికల్‌ని చూస్తూ, చూడనట్టుగా మొహం తిప్పుకుని పోతున్నారు. నూటికి తొంభైమంది వెహికిల్స్ జీప్‌ల స్థాయినించి కార్‌లకీ వేన్‌లకీ ఎదిగినా, వాసుదేవ్‌కి జీపే ఇష్టం. జీప్ కుండే గాంభీర్యం ఇతర వాహనాలకు ఉండదు.

హాజీసాబ్ నించి సెలవుతీసుకుని వెళ్ళిపోవాలి. కానీ అతని మనసు ఎందుకో వెళ్లనని మొరాయిస్తోంది. అతనికి తెలుసు. ఏదో జరుగుతోందని. కానీ, జరుగుతోంది ఏదో ఊహలోకి కూడా రావడంలేదు. సుదీర్ఘంగా నిట్టూర్చి హాజీ సాబ్‌కి సలాం చేసి బయలుదేరాడు. జీపుకూడా ఓసారి స్టార్ట్ కానని మొరాయించి, ఆ తరవాత స్టార్టయింది.

ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు అరిదమనుడు, అలంబసుడు. విశ్వశాంతి యాగం తాలుకు ప్రయోజనం ఏదీ ఇంకా సిద్దించలేదు. శిష్యులు, మట్టూ వారందరూ ఎంత తిరుగుతున్నా 'ఏదో ఉన్నది' అన్న ఖచ్చితమైన వూహేకానీ, ఆధారాలేవీ కనపడలేదు. అలంబసుని మనసులో మహా భారత యుద్ధమే తిరుగుతోంది.

"అలంబసా.. నీ మనసునేదో వేధిస్తోంది. ఏమిటీ?" నడుస్తూనే అడిగాడు అరిదమన.

"నిజమే. ఎవరో నా గతాన్ని ఫలానా అని చెప్పారు. అదే నిజమని నేను నమ్మాను అంటున్నారు. కానీ వారికి తెలియనిదేమంటే, మూసి పెట్టిన పెట్టెలో వీణవుంది. పెట్టె తలుపు తీస్తే వీణ కనిపించినట్టుగా నాకు చెప్పినవారు ఆ పెట్టెమూతని తెరిచారు అంతే. గత జన్మతాలూకు వీణని నేనే సృశించా. అరిదమనా, ఎవరు నమ్మినా నమ్మకపోయినా, అలనాటి ప్రకంపనలు నాలో ఇంకా మిగిలేవున్నాయి. మనసుకి శరీరంతో పనిలేదుగా, ప్రస్తుతం నా శరీరం నీతోపాటు ప్రదక్షిణలు చేస్తోంది. మనసు మాత్రం కురుక్షేత్రం. ఆ సంగ్రామంలో ఉంది నీద్వారానో, నా ద్వారానో కొన్ని విషయాలు బైటపడాలి. బహుశా అలా పడటం కోసమే భగవంతుడు యీ జన్మని ఇచ్చాడేమో" మాట ముగించాడు అలంబసుడు.

"నేనూ అదంతా నీ భ్రమ అనుకున్నది నిజం. కానీ, కాలం అనేది మనోసంబంధే కానీ శరీర సంబంధం కాదు శరీరం అనేది ఒక్క పరిమితకాలం వరకే ఉండేది. ఆ పరిమిత కాలంలో కూడా, దానికి బాల్య, యవ్వన, కౌమార వృద్ధాప్య అవస్థలు వుంటాయి. మనసు ఏ అవస్థలో వున్నా దానికి అతీతమైనది. నిన్ను నేను నమ్ముతాను. నీ అలజడికీ అర్ధం వుంది. ఒకటి మాత్రం నిజం. గతమూ వర్తమానమేకదా. భవితకి పునాది చూద్దాం. నీ యొక్క సంపూర్ణ అనుభవాన్నికూడా విశ్లేషిస్తే ప్రస్తుత అలజడికీ, అశాంతికీ కారణం మనకి స్పష్టంగా గోచరించవచ్చు" అరిదమనుడు నడుస్తూనే మాట్లాడాడు. వారి వెనక కొద్ది దూరంలో వున్న మట్టుకి స్పష్టంగా వారి మాటలు వినపడ్డాయి. రామజోగి చెప్పడం వల్ల మట్టూ మళ్ళీ ఆలయం వద్దకి రావల్సి వచ్చింది. వచ్చింది కూడా ఆనాటి తెల్లవారు ఝామునే. అనీషుడు సంకల్పానంద ఆలయంలో అమ్మవారికి అలంకారం చేస్తున్నాడు. పిల్లగాలి చల్లగా వీస్తోంది. అమ్మవారి ముఖంలో చిన్న చిరునవ్వు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments